# నమస్తే తెలంగాణ
DISTRICT SUPPLEMENT

# నిర్మల్

ఆదివారం 29 అక్టోబర్ 2023
SUNDAY, OCTOBER 29, 2023

NIRMAL

పేజీలు : 12
PAGES




ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రజలు

# పదికి పది గెలుస్తాం

## ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి ఖిల్లాగా మారింది..



- ఉమ్మడి జిల్లాలో నాలుగు మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేశాం..
- లోయర్ పెన్‌గంగ ప్రాజెక్టుతో రైతుల కల నెరవేరింది..
- ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు టికెట్ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ
- సీసీఐని అమ్ముతున్న బీజేపీకి డిపాజిట్ రావద్దు..
- వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- ఆదిలాబాద్, ఉట్నూర్‌లలో భారీ బహిరంగ సభలు

.. మధ్యపేజీలో



మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు, చిత్రంలో ఆదిలాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే రామన్న, బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్

**'ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని** పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ విజయదుందుభి మోగిస్తుంది. సీఎం కేసీఆర్ సారథ్యంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో దూసుకుపోతున్నది. వ్యవసాయం, ఐటీ రంగాల్లో ముందంజలో ఉంది.' అని రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆదిలాబాద్, ఉట్నూర్ పట్టణాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో మంత్రి ప్రసంగించారు. నాలుగు జిల్లాల్లో మెడికల్, ఆదిలాబాద్‌లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత బీఆర్ఎస్ సర్కారుకే దక్కుతుందన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత లోయర్ పెన్‌గంగా ప్రాజెక్టు కలను సీఎం కేసీఆర్ నిజం చేసి రైతుల మోములో సంతోషాన్ని నింపారన్నారు. తెలంగాణలో సెక్యూలర్ ప్రభుత్వాన్ని కూల్చడానికి కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటయ్యాయని మండిపడ్డారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకొని తయారు చేశారని పేర్కొన్నారు.

*- ఆదిలాబాద్, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ)*




ఆదిలాబాద్ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్ రావు, వేదికపై ప్రజాప్రతినిధులు



ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ అసమ్మతి వర్గం

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ టికెట్ అజ్మీరా శ్యాంనాయక్‌కు కేటాయించడంపై సీనియర్ నాయకులు మర్సుకోల సరస్వతి, గణేశ్ రాథోడ్ శనివారం ధర్నా నిర్వహించారు. పారాచ్యూట్ హఠావో.. కాంగ్రెస్ బచావో అంటూ నినాదాలు చేశారు.

బైంసాలో కాంగ్రెస్ కండువాలను కాలుస్తున్న దృశ్యం



# బీసీలకు మొండి 'చెయ్యి'

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకరికే చాన్స్

- ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌ను మరిచిన కాంగ్రెస్
- మహిళలను పూర్తిగా విస్మరించిన హస్తం పార్టీ
- కొత్తగా వచ్చిన పారాచ్యూట్ నేతలకే టికెట్లు
- అసమ్మతి, వర్గపోరుతో కుతకుతలాడుతున్న హస్తం

..2లో

**కాంగ్రెస్ పార్టీలో** అసెంబ్లీ అభ్యర్థుల ప్రకటన తర్వాత అగ్గిరాజుకుంటున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది నియోజకవర్గాలు ఉండగా.. అందులో ఒక్క స్థానాన్ని మాత్రమే బీసీలకు కేటాయించడంతో అట్టుడుకుతున్నది. ఉదయ్‌పూర్ డిక్లరేషన్‌లో పార్లమెంట్ నియోజకవర్గానికి రెండు సీట్లు ఇస్తామని ప్రకటించిన హస్తం పార్టీ ఒక్క సీటుతోనే సరిపుచ్చింది. బీఆర్ఎస్ పార్టీ నాలుగు సీట్లు ఇచ్చి గౌరవించింది. బీఆర్ఎస్, బీజేపీలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒక్కో సీటును మహిళకు కేటాయించగా.. కాంగ్రెస్ పార్టీ మాత్రం మహిళలకు ఒక్క సీటు కూడా కేటాయించలేదు. పారా చ్యూట్ నేతలకూ టికెట్లు ఇవ్వడంపై హస్తం నేతలు మండిపడుతు న్నారు. శనివారం ఆసిఫాబాద్, ముథోల్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు రోడ్ల మీదికి వచ్చి ఆందోళనలు చేశారు.

*- మంచిర్యాల, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



బైంసా : నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా నారాయణరావు పటేల్‌ను అధిష్టానం ప్రకటించడంపై కిరణ్ కొమ్రేవార్ అనుచరులు పార్టీ ఆఫీసులో నల్ల రిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కిరణ్ కొమ్రేవార్‌కు టికెట్ కేటాయించకుండా అన్యాయం చేసిందని, త్వరలో తమ నిర్ణయం ప్రకటిస్తామని తెలిపారు.

# వీరుడికి ఘన నివాళి

## జోడేఘాట్‌లో అధికారికంగా భీం, సూరు వర్ధంతి

- నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- సంస్కృతీ సంప్రదాయాల నడుమ భీం వారసుల పూజలు
- వేలాదిగా తరలివచ్చిన అడవిబిడ్డలు.. జన సంద్రమైన పోరుగడ్డ
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- ఎన్నికల కోడ్ కారణంగా రద్దయిన దర్బార్
- పోలీసుల భారీ బందోబస్తు

మధ్యపేజీలో

**జల్.. జంగల్.. జమీన్** కోసం పోరాడిన వీరుడి త్యాగాలను యావత్ ప్రజానీకం స్మరించుకున్నది. శనివారం కెరమెరి మండలం జోడేఘాట్‌లో కుమ్రం భీం, కుమ్రం సూరు వర్ధంతిని అధికారికంగా నిర్వహించగా, ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన జనసందోహంతో పోరుగడ్డ పులకించింది. డప్పు చప్పుళ్లు, సన్నాయి, కాలీకోం వాయిద్యాలు.. ఆటా పాటలతో ఆ ప్రాంతం మారుమోగింది. భీం మనువడు సోనేరావ్, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయి, ఎస్పీ సురేశ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ దీపక్ తివారి భీం విగ్రహం, సమాధివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కారు ఆదివాసుల అభ్యున్నతికి చేసిన కృషిని వివరించారు.

*- కుమ్రం భీం ఆసిఫాబాద్(నమస్తే తెలంగాణ)/ కెరమెరి, అక్టోబర్ 28*

కుమ్రం భీం సమాధి వద్ద నివాళులర్పిస్తున్న సోనేరావ్, జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, తదితరులు

